క్లుప్తంగా

రెవెన్యూ అధికారి బదిలీ


ఆర్వో సోమశేఖర్ యాదవ్

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ రెవెన్యూ అధికారి సోమశేఖర్‌యాదవ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను గూడూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మేనేజర్‌గా నియమించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు నగర పంచాయతీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్వీ రాంప్రసాద్‌ను డిప్యూటేషన్ పద్ధతిపై ఏడాది కాల పరిమితితో తెనాలి మున్సిపల్ ఆర్వోగా ఉన్నతాధికారులు నియమించారు. బుధవారం ఆయన విధుల్లో చేరే అవకాశం ఉంది.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి



తెనాలిఅర్బన్: సేవా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని జెఎంజె కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ డే వేడుకలను జెఎంజె కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని అందరూ ఆదుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. చేతనైనా సహాయాన్ని చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ కె.నిర్మల జ్యోతి, డాక్టర్ సాంబశివుడు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాణిక్యరావు నియామకం పట్ల హర్షం

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (లీడ్ క్యాప్) చైర్మన్‌గా పిల్లి మాణిక్యరావును నియమించడం పట్ల అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆళ్ళమూడి ప్రభాకర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్‌లో మాణిక్యరావుతో పాటు కలిసి పనిచేసినట్లు గుర్తు చేశారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఆయనను నియమించిన సీఎం చంద్ర బాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏ కష్టం వచ్చిందో?


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తెనాలిరూరల్: విజయవాడ-చెన్నై రైలు మార్గంలో పట్టణ మారీసుపేట మొండి గోడల వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మంగళవారం తెల్లవారుజాము సమయంలో రైలు కింద పడి అతడు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. రైలు పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడటంతో అతడి శరీరం నుంచి తలభాగం వేరుపడిపోయింది. విషయం తెలుసుకున్న రైల్వే జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 50 నుంచి 52 సంవత్సరాల వయస్సు కలిగిన మృతుడు ఎవరన్న వివరాలు ఇంకా తెలియలేదని విచారణ జరుపుతున్నామని రైల్వే ఎస్ఐ జి. వెంకటాద్రి తెలిపారు. మృతుడి జేబులో విజయవాడలోని ఓ క్లోక్ రూంకు చెందిన లగేజీ బ్యాగు స్లిప్పు మాత్రం ఉందని ఆ దిశగా వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వెంకటేశ్వరరావు సేవలు మరువరానివి



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పి.వెంకటేశ్వరరావు చేసిన కృషి మరువరానిదని పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి నాయకులు కొనియాడారు. ఉద్యోగ సంఘ నాయకుడు పాలడుగు వెంకటేశ్వరరావు 14వ వర్ధంతిని కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగులకు పీఆర్సీ లభించడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, సుబ్బారావు, హృదయ రాజు, విద్యాసాగర్, సత్యసాగర్, పాలడుగు వెంకట్రావు, అజ్గర్ ఆలీ పాల్గొన్నారు.

కామ్రేడ్ కొరటాలకు నివాళి

భట్టిప్రోలు: దివంగత సీపీఎం నాయకులు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ జయంతి సందర్భంగా భట్టిప్రోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం సీపీఎం భట్టిప్రోలు మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ కొరటాల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు టి. కృష్ణమోహన్, మండల కార్యదర్శి జి. సుధాకర్, సభ్యులు ఎం. సత్యన్నారాయణ, కె. రామస్వామి, డి. సత్యన్నారాయణ, జి. నాగరాజు, ఎస్. డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా కబేళా భవనం

- ప్రతిపాదనలకే పరిమితమైన వాటర్ ట్యాంక్ నిర్మాణం
- కబేళా ముందు యథేచ్ఛగా మాంసం విక్రయాలు


నిరుపయోగంగా మారిన కబేళా భవన సముదాయం

తెనాలిఅర్బన్: పురపాలక సంఘ పరిధిలోని కబేళా అలంకార ప్రాయంగా మారింది. ఇది నిరుపయోగంగా దశాబ్దాలకు పైగా ఉండటంతో పాలకులు దీనిలో ప్రజల దాహార్తిని తీర్చే ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని భావించారు. కానీ అది ప్రతిపాదనలకే పరిమితమైంది. కనీసం వాటర్ ట్యాంక్ నిర్మించే వరకు అయిన కబేళాను ఉపయోగంలోకి తేవాల్సి ఉండగా ఆ దిశగా అధికారులు ఆలోచన చేయలేదు. దీంతో కొందరు వ్యాపారులు యథేచ్ఛగా దాని ముందు మాంసం విక్రయాలు చేస్తున్నారు.

తెనాలి పట్టణంలో సుమారు 1.60 లక్షల జనాభా ఉంటారు. పట్టణ జనాభా పెరుగుతుండటంతో మాంసాహార ప్రియులు పెరిగారు. దీంతో తెనాలి పురపాలక సంఘ అధికారులు ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముత్తింశెట్టి పాలెంలో గతంలో కబేళాను నిర్మించారు. అలాగే అక్కడ ఒక పశు వైద్యుడిని, కట్ చేసే వ్యక్తిని, వాచ్‌మెన్‌ను నియమించారు. అలాగే బిస్మిల్లా చేసేందుకు ఒక ముస్లిం వ్యక్తిని కూడా అందుబాటులో ఉంచారు. వీరు అక్కడికి వ్యాపారులు తెచ్చిన గొర్రెలు, కోళ్ళు, గేదెలను పరీక్షించి, అవి ఆరోగ్యంగా ఉంటే వాటిని కోసేందుకు అనుమతి ఇస్తారు. పశువులు అనారోగ్యంగా ఉంటే వాటిని కోసేందుకు అనుమతి ఇవ్వరు. అలాగే పశువులను అక్కడే కోసి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. పట్టణంలో మటన్, చికెన్ షాపులు సుమారు రెండు వందలకు పైగా ఉంటాయి. వీరందరు ప్రతిరోజు కబేళాకు వచ్చి వారు కోసి అమ్మే జంతువులకు పరీక్షలు జరిపించుకుని అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే కబేళా నిర్వహణను వేలంపాట ద్వారా వ్యాపారులకు అప్పగిస్తారు. దీనివల్ల మున్సిపాలిటీకి ఏడాదికి సుమారు రూ.5 లక్షల ఆదాయం సమకూరేది. కబేళా నిర్వహణను గాలికి వదిలేసిన అధికారులు ముత్తింశెట్టి పాలెంలోని కబేళా నిర్వాహణను మున్సిపల్ అధికారులు దశాబ్ద కాలంగా గాలికి వదిలేశారు. దానిలో పనిచేసే వైద్యుడు బదిలీపై వెళ్ళిపోవటంతో అప్పటి నుంచి దాని ఊసే అధికారులు మరిచారు. చేసేదిలేక అక్కడ నివశించే కొందరు వ్యాపారులు దానిలో ఎటువంటి పరీక్షలు జరపకుండా వివిధ జంతువులను కోసి దాని ముందే విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది.


కబేళా బయట మాంసం విక్రయాలు

ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కౌన్సిల్ అనుమతి

తెనాలి మున్సిపాలిటీ సరఫరా చేసే రక్షిత మంచి నీరు 17,18,19,20 వార్డులలో ఫోర్సుగా రావటంలేదు. దీనిపై పలుసార్లు కౌన్సిలర్లు ఇంజినీరింగ్ అధికారులు ఫిర్యాదు చేశారు. సమీపంలో వాటర్ ట్యాంక్ నిర్మిస్తే సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు భావించి ఆ విషయాన్ని కౌన్సిలర్లకు తెలియజేశారు. దీంతో వారు నిరుపయోగంగా ఉన్న కబేళాలో కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అమృత్ పథకంలో రూ.3 కోట్లతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించాలనే ప్రతిపాదన మున్సిపల్ కౌన్సిల్ ముందుకు తెచ్చారు. దీంతో కౌన్సిల్ ఆమోదించింది. వెంటనే ఆ ప్రతిపాదనను అధికారులు ఉన్నతాధికారులకు పంపారు. ఏడాది దాటినా ఇప్పటి వరకు దానికి అనుమతులు రాలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్‌కు అనుమతులు వచ్చే లోపు కబేళాను ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇలా చేయటం వల్ల వ్యాధులు ప్రబలుతున్న నేటి రోజుల్లో ప్రజారోగ్యాన్ని కొంత వరకు కాపాడే అవకాశం ఉంటుంది. కబేళా స్థలంలో వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామని మున్సిపల్ ఏఈ చైతన్య తెలిపారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తామన్నారు.

చదివింది ఐటీఐ.. చేస్తోంది దొంగతనాలు!

- మోటార్ సైకిల్స్ దొంగ అరెస్ట్
- ఆరు బైకులు రికవరీ
- 2022 నుంచి చోరీలే వృత్తిగా...
- గత కేసులలో బెయిల్ పై విడుదల


రికవరీ చేసిన బైకులు, నిందితుడితో పోలీసులు

కొల్లిపర: ఆ యువకుడు ఐటీఐ చదువుకున్నాడు. చెడు వ్యసనాలకు, జల్సాలకు బానిసయ్యాడు. దీంతో ఇంట్లో ఇచ్చే పాకెట్ మనీ చాలకపోవడంతో దొంగగా మారిపోయాడు. 2022 నుంచి వివిధ ప్రాంతాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు చేసి గతంలో జైలుకి వెళ్లి బెయిల్ పై విడుదలయ్యాడు. అయినా మార్పురాలేదు. మళ్లీ అదే చోరవృత్తిని కొనసాగించాడు. మళ్లీ పోలీసులు.. అరెస్టులు.. షరామామూలే. ఆ యువకుడు ఎవరో కాదు. కొల్లిపర గ్రామానికి చెందిన అమిరే ఆనంద కిషోర్ (చోటు). కొన్ని రోజులుగా కొల్లిపర మండలంలోని వివిధ గ్రామాల్లో ఆరు మోటార్ సైకిళ్లు దొంగతనమయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిఘా పెట్టారు. సోమవారం రాత్రి దావులూరు అడ్డరోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆనంద కిషోర్ (చోటు)ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు తెనాలి రూరల్ సీఐ బెల్లంకొండ శ్రీనివాస రావు వెల్లడించారు.

మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో ఆరు బైకులు దొంగతనానికి గురైనట్లు వరసగా కేసులు నమోదయ్యాయన్నారు. తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ఆదేశాల మేరకు తెనాలి రూరల్ సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో కొల్లిపర ఎస్ఐ పి.కోటేశ్వరరావు సిబ్బందితో కలసి గాలించగా కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఆరు మోటార్ సైకిళ్లను నిందితుడు ఆనంద కిషోర్ (చోటు) వద్ద ఉన్నట్లు గుర్తించి వాటిని రికవరీ చేసి అతని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నేరం రుజువు కావటంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 6 మోటార్ సైకిల్ విలువ సుమారు రూ.3,20,000 ఉంటుందని వివరించారు. గతంలో ఇదే నిందితుడి పై కొల్లిపర పోలీస్‌స్టేషన్‌లో ఐదు, కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో 3, పెద్దకాకాని పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, పడమట పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, తెనాలి త్రి టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు, భట్టిప్రోలు పోలీస్‌స్టేషలో ఒకటి ఆయా స్టేషన్‌లో అన్ని కలిపి మొత్తం 15 దొంగతనం కేసులు నమోదైనట్లు తెలిపారు. వాహనదారులు తమ మోటార్ సైకిళ్లకు తాళాలను వదిలి వెళ్లవద్దని, అలాగే సరైన చోట మోటార్ సైకిల్ ను పార్కింగ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

అలాగే అపార్ట్‌మెంట్లలో ఉన్న వాళ్లు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఖరీదైన మోటార్ సైకిల్‌లకు జీపీఎస్ అమర్చుకోవాలన్నారు. కొల్లిపర పోలీస్ స్టేషన్ దర్యాప్తు బృందం ఎస్ఐ పి.కోటేశ్వరరావు, ఏఎస్ఐ ఎ.పోతురాజు, హెడ్ కానిస్టేబుల్ బి.తాతారావు, కానిస్టేబుల్‌లు ఎస్.నాగబాబు, ఎం.కూర్మారావు, కె.విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభలను సమర్థంగా నిర్వహించండి

కమిషనర్ శేషన్న


మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధ, గురువారాల్లో జరిగే వార్డు సభల్లో ప్రజలందరూ పాల్గొనే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 సంబంధించిన విధి విధానాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వి.మహాలక్ష్మిపతి రావు, హౌసింగ్ ఈఈ వై.భాస్కరరావు, పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్పులకనుగుణంగా సస్యరక్షణ చేపట్టాలి


రైతులకు సూచనలిస్తున్న డాక్టర్ రత్న

తెనాలిరూరల్: వాతావరణంలో వచ్చేమార్పులకు అనుగుణంగా వరి పంట సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుడివాడ గ్రామంలో మంగళవారం సాయంత్రం క్షేత్ర సందర్శన చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నం మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనల మేరకు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో నీటి యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పంట దెబ్బతినకుండా ఉంటుందని చెప్పారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ నాము తెగులు నివారణకు ఫ్లు బెండమైడ్‌ను కరాకు 30 ఎంఎల్ చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఉదయం కొలకలూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గుంటూరు సాయిల్ టెస్టింగ్ లేబోరేటరీ ఏడీఏ అన్నపూర్ణమ్మ, వీఏఏ నాగరాజు, వంశీ, శివతేజ, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ బాలునాయక్, పశు సంవర్ధక శాఖ జేవీఓ ఎం. వీరయ్య, వీఏఏ అనూష, రైతులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మంత్రి నాదెండ్ల మనోహర్


మంజూరైన గ్రూపులకు చెక్కు నమూనాను అందిస్తున్న మంత్రి మనోహర్

కొల్లిపర: గ్రామాల్లో డ్వాక్రా గ్రూపులలోని మహిళలు ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయ బృందం) ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు పొంది వాటి ద్వారా ఇంటి వద్దనే వివిధ చిన్న తరహా పరిశ్రమలు, చిరు వ్యాపారాలు, పాడిపశువులు, పకృతి వ్యవసాయం వంటి వాటిలో పెట్టుబడి పెట్టి ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగి వారి కుటుంబ ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు తీసుకురావాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పాల కేంద్రం కల్యాణ మండపంలో ఎస్‌హెచ్‌జీ మహిళలకు బ్యాంకు ఋణాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్న డ్వాక్రా గ్రూపు మహిళలకు చెక్కులు అందజేశారు. సభకు అధ్యక్షతగా ఏపీఎం ప్రియదర్శిని వహించారు. ప్రతి డ్వాక్రా మహిళలు కష్టపడి పనిచేయాలని, అదే విధంగా జిల్లాల్లోని మంచి పేరు తెచ్చుకొనే విధంగా మహిళలు, అధికారులు కృషి చేయాలని సూచించారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కొల్లిపర మండలంలో వరదలు కారణంగా 3353 ఎకరాలల్లో పంట నష్టం జరిగిందన్నారు. సభ అనంతరం కొల్లిపర మండలంలో డ్వాక్రా గ్రూపులు వారు అందరు కలసి వరద బాధితుల సహాయం కొరకు రూ.4 లక్ష 70 వేలు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానశాఖాధికారి బి.రవీంద్రబాబు, ఉద్యాన శాఖ ప్రధాన శాస్త్రవేత డాక్టర్ గిరిధర్, సీనియర్ శాస్త్రవేత్త నాగలక్ష్మి, తెనాలి ఏడీఏ ఎం.ఉషారాణి, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారిణి రాజకుమారి, ఏపీఎం ప్రియదర్శి, ఎంపీడీవో విజయలక్ష్మి , తహసీల్దారు సిద్ధార్థ, ఏవో కె.వెంకటరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు యర్రు వెంకయ్య నాయుడు, కూటమి నాయకులు అడపా నారాయణ రెడ్డి, కొండా కిషోర్‌రెడ్డి, కట్టా శ్రీహరి, ఆళ్ళ వీరారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'మనతెనాలి' వాట్సాప్ గ్రూప్

తెనాలి: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం 'మన తెనాలి' పేరుతో వాట్సాప్ నంబరును ప్రజలు వినియోగించుకోవాలని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత ఫొటోతో సంక్షిప్త వివరాలను వాట్సాప్ చేయాలని, ఈ ప్రత్యేక గ్రూప్‌లో తనతోపాటు సబ్‌కలెక్టర్ సహా 11 శాఖలకు సంబంధించిన డివిజన్‌స్థాయి అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉంటారని చెప్పారు. సమస్యకు వెంటనే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని పొదుపు భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మనోహర్ 'మన తెనాలి' పేరుతో వాట్సాప్ నంబరు 76599359993ను ప్రారంభించారు. ఈ గ్రూప్‌ను కేవలం సమస్య పరిష్కారానికి మాత్రమే ఉపయోగించాలనీ, ఇబ్బందికరమైన అంశాలను పోస్టు చేస్తే తక్షణ చర్యలు తప్పవని మనోహర్ హెచ్చరించారు. తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ, తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, వ్యవసాయ ఏడీఏ ఉషారాణి, ఎలక్ట్రికల్ డీఈ వీవీ.చిరంజీవి, ఇరిగేషన్ ఈఈ సత్యనారాయణ, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

సభానంతరం విజయవాడ నగరంలో ఇటీవల వరద ముంపునకు గురైన ప్రాంతాలలో సహాయక చర్యల్లో పాల్గొన్న తెనాలి మున్సిపాలిటీకి చెందిన 115 మంది కార్మికులకు నూతన వస్త్రాలను మంత్రి మనోహర్ అందజేశారు. మహిళా కార్మికులకు చీరలు, పురుషులకు రెండు జతల చొప్పున ప్యాంట్ షర్ట్‌లు పంపిణీ చేశారు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు సాయం


దోమతెరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఇంటర్నేషనల్ వాసవి జాగృతి సంయుక్త ఆధ్వర్యంలో వరద ప్రభావిత గ్రామాల్లోని 500 కుటుంబాలకు మంగళవారం దోమతెరలు పంపిణీ చేశారు. కొల్లూరు మండలం శివరామపురం, తిప్పలకట్ట, కిష్కింధపాలెం, గ్రామాలలో జరిగిన కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షులు జి.వెంకట రవీంద్ర కుమార్, ఇంటర్నేషనల్ వాసవి జాగృతి అధ్యక్షులు రంగ చంద్రశేఖర్, నిర్వాహకులు తుమ్మల వెంకట సాయి నాగభూషణం, బొలిశెట్టి బాపారావు, సంకా శ్రీనివాసరావు, నరసింహమూర్తి, వెంకటేశ్వరరావు, వెల్లటూరు క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

- భట్టిప్రోలు మండలం పెసర్లంక, పెదలంక గ్రామాల్లోని మూడు మండల పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న 50 మంది వరద బాధిత విద్యార్థుల కుటుంబాలకు మంగళవారం చీరాల ఓడరేవు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు చేయూతనందించారు. నిత్యావసరాలు, బియ్యం అందించారు. చీరాల నుంచి ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు షేక్ ఇలియాజుద్దీన్, పి.నారాయణ, ఎంఎస్ మీర్జాన్, పి.వెంకట్ వచ్చి బాధితులకు సహాయం అందజేశారు.


నిత్యావసరాలు అందజేస్తున్న చీరాల ఓడరేవు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు

మాకు ఉద్యోగ భద్రత కల్పించండి

అసిస్టెంట్ డిపో మేనేజర్‌కు మద్యం దుకాణాల సిబ్బంది వినతి


అసిస్టెంట్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది

తెనాలిరూరల్: గత ఐదేళ్లుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ సేల్స్ మెన్ అండ్ సూపర్‌వైజర్ల తెనాలి ఎక్సైజ్ డిపో అసిస్టెంట్ మేనేజర్‌ను కోరారు. తెనాలి డిపోలో ఏడీఎంను అసోసియేషన్ సభ్యులు మంగళవారం కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3600 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 12 వేలకుపైగా సిబ్బంది పనిచేస్తున్నామని, ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాల నుంచి తొలగించేస్తున్నారని, ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో తాము అయోమయంలో ఉన్నామని చెప్పారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ తెనాలి అధ్యక్షుడు పినపాటి కొండల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రజాక్, ధనరాజుపల్లి సురేష్, భాస్కర్, గోపి, ప్రకాష్, ఆనంద్, అశోక్, శ్రీనివాస్, నాగూర్, సందీప్, ఇతర సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

మహిళా కానిస్టేబుళ్లు నేరాల సమాచారం ఇవ్వాలి



వేమూరు: గ్రామాల్లో పేకాట శిబిరాల ఏర్పాటు, చోరీలు, గంజాయి ముఠాల సంచారం వంటి సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని మహిళా కానిస్టేబుళ్లకు వేమూరు రూరల్ సీఐ వీరాంజనేయులు సూచించారు. సర్కిల్ పరిధిలోని వేమూరు, కొల్లూరు మండలాల మహిళా కానిస్టేబుళ్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన బాధ్యత మహిళా కానిస్టేబుళ్లపై ఉందని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి కృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

వేమూరు: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా చేపట్టిన గృహనిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి విలియమ్స్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గృహ నిర్మాణంపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. విలియమ్స్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతానికి కృషి చేయాలని చెప్పారు. డీఈ సీతారామయ్య, తహసీల్దారు సుశీల, ఇన్‌చార్జి ఎంపీడీఓ అనూరాధ, పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్ పాల్గొన్నారు.


భట్టిప్రోలు కూరగాయల మార్కెట్ వద్ద నిలిచిన వర్షపు నీరు


భట్టిప్రోలు కొత్త విఠలేశ్వరనగర్ కాలనీ రహదారిపై ఇలా..

చినుకు పడితే చిత్తడే

భట్టిప్రోలులో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఫలితంగా చినుకుపడితే చిత్తడిగా మారుతోంది. మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి ఇలా రోడ్లు జలమయమయ్యాయి. ఫలితంగా వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు పందుల బెడద ఎక్కువైంది. పారిశుద్ధ్య సమస్య పట్టిపీడిస్తోంది. భట్టిప్రోలులోని కొత్త విఠలేశ్వరనగర్ కాలనీ, దేవాలయం రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. డ్రెయినేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– భట్టిప్రోలు

కోనేటిపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం



భట్టిప్రోలు: కోనేటిపురంలో తరచూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. సోమవారం అర్ధరాత్రి కోనేటిపురం 6వ వార్డులో చెట్ల కొమ్మల వల్ల షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ తీగ తెగిపోయింది. దీంతో సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానికుల ఫిర్యాదుతో పల్లెకోన నుంచి లైన్‌మెన్ వచ్చి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ అంతరాయంతో మూడు గంటలపాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో రెగ్యులర్ లైన్‌మెన్ లేకపోవడంతో కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై భట్టిప్రోలు సబ్‌స్టేషన్ జేఈ ఎస్.శాంతకుమారిని వివరణ కోరగా ప్రస్తుతం ఆ గ్రామానికి ఇన్‌చార్జ్ లైన్‌మెన్ ఉన్నారని, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి సమస్యను పరిష్కరించామని చెప్పారు.